## క్లుప్తంగా

### శ్రీశైలానికి బయలుదేరిన శివ మాలధారులు



సాయిబాబా ఆలయంలో పూజల్లో పాల్గొన్న శివస్వాములు

ఆలూరు: పట్టణం నుంచి శివ మాలధారులు పాదయాత్రగా ఇరుముడితో శ్రీశైలానికి బుధవారం బయలుదేరారు. ముందుగా ఉదయం స్థానిక జలకంఠేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వామి క్రిష్టప్ప, లక్ష్మీనారాయణస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం పూర్తి చేసి బంధుమిత్రులు ఊరేగింపుగా సాగనంపగా పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరారు.

చిప్పగిరి: మండలంలోని నగరడోణ గ్రామ శివాలయంలో శివ మాలధారులు బుధవారం ఇరుముడి స్వీకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేపట్టారు. చివరగా కుటుంబ సభ్యులు, బంధువులు వారిని ఊరేగింపుగా సాగనంపగా శ్రీశైలం తరలివెళ్లారు.

### మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓలు

మద్దికెర : స్థానిక ఆదర్శ, మెయిన్ పాఠశాలల్లో ఎంఈఓలు రంగస్వామి, గోపాల్ బుధవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా పరిశీలించి వంట గదులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ వంట ఏజెన్సీలు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థులు భోజనం చేసేముందు చేతులు శుభ్రం చేసుకునేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని చెప్పారు.

### నాయీ బ్రాహ్మణులకు న్యాయం చేయండి



వినతిపత్రం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణులు

మద్దికెర : కుల వృత్తి చేసుకుంటూ జీవనం చేస్తున్నాం.. పంచాయతీ గదులకు డిపాజిట్లు లేకుండా అద్దెకు ఇవ్వాలని నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వీరేంద్ర కోరారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓ శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా కుల వృత్తిని నమ్ముకొని గ్రామంలో దాదాపు 50 మంది బంకులు పెట్టుకొని జీవనం చేస్తున్నామన్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన గదులకు డిపాజిట్లు,బాడుగలు చెల్లించాలేమని, కావున అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. విషయాన్ని పంచాయతీ సభ్యుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఈఓ తెలిపారు. రామాంజనేయులు, శేఖర్, వెంకటరాముడు, ఓబులేసు, నాగులు, నరసప్ప ఉన్నారు.

### నీటి సమస్య పరిష్కారం



ఎల్లార్తిలో పైప్‌లైన్ పనులు జరుగుతున్న దృశ్యం

హొళగుంద: ఎల్లార్తి దర్గా పరిసరాల్లో ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు సర్పంచ్ కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో బుధవారం పైప్‌లైన్ పనులు చేపట్టారు. కాలనీవాసులకు నీరు సరఫరా కాక తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో గ్రామంలో బోరు వేయించి ఆయా వీధులకు నీరందేలా పైప్‌లైన్ వేయించేందుకు చర్యలు చేపట్టారు. ఇక నుంచి సక్రమంగా నీటిని సరఫరా చేస్తామని చెప్పారు.

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



ఫ్లోర్ కర్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

చిప్పగిరి: స్థానిక కేజీబీవీలో 7,8,9, తరగతి చదువుతున్న 14 మంది విద్యార్థినులు జాతీయ స్థాయి ఫ్లోర్ కర్లింగ్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఎస్‌ఓ సౌజన్య బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఫ్లోర్ కర్లింగ్ పోటీల్లో పాల్గొని ఐదుగురు విద్యార్థినులు స్వర్ణం, 4 వెండి పతకాలు సాధించారని చెప్పారు. పాల్గొన్న 14 మంది విద్యార్థినులు జనవరి 28న జమ్మూ కశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు జ్యోత్స్న, తేజస్విని, స్వప్న,సింధు, ప్రియాంక తదితరులను అభినందించారు.

# బీమా.. భారం!

- రైతులే పంటల బీమా ప్రీమియం చెల్లించాలంటున్న కూటమి సర్కారు
- ఈ ఏడాది అన్నదాతలకు కలిసిరాని వ్యవసాయం
- ఇప్పటికే వర్షాభావం, అతివృష్టి, తెగుళ్లతో పంటల నష్టం
- జగనన్న హయాంలో ప్రభుత్వమే చెల్లించిన వైనం
- నమోదుకు ముందుకు రాని రైతులు

**వైఎస్సార్‌సీపీ కన్నా రెండింతల సంక్షేమం అందిస్తాం.. రైతులకు మరింత మెరుగైన సాయం చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీలు గుప్పించారు. తాను మారిపోయానని, వ్యవసాయానికి అండగా నిలుస్తానని చంద్రబాబు రైతులను నమ్మించి గెలుపొందారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత తన నిజ స్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా కనీసం సాయం అందించకపోగా.. కష్టాల్లో ఉన్న అన్నదాతకు చేయూతనివ్వకపోవడమే గాక బీమా ప్రీమియం మీరే చెల్లించాలని, సర్కారుకు ఏమాత్రం సంబంధం లేదని ప్రకటించడంతో కర్షకుల నెత్తిపై పిడుగు పడినట్లయ్యింది. గత ఐదేళ్లు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వమే బీమా భారం భరించేలా చర్యలు చేపట్టి కష్టజీవికి అండగా నిలిచారు.**

చిప్పగిరి: ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి తీవ్ర వర్షాభావం.. ఆ తరువాత భారీ వర్షాలు.. ఆ తరువాత తెగుళ్లు చుట్టుముట్టడంతో రైతులు పంటలు నష్టపోయారు. అయినా కూటమి సర్కారు వారిని ఆదుకునే చర్యలు తీసుకోకపోగా.. బీమా తమ బాధ్యత కాదని స్పష్టం చేయడంతో రైతులు ఖిన్నులయ్యారు. గత ఐదేళ్లు వైఎస్సార్‌సీపీ పాలనలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు చేపట్టారు.

**అన్నదాతకు అండగా జగనన్న..**

గత ప్రభుత్వం ఐదేళ్లలో రైతు భరోసా కింద మండలంలోని 7,819 మంది రైతులకు రూ.10.55 కోట్లు, విత్తన రాయితీ కింద 11,763 మంది రైతులకు రూ.5.26 కోట్లు, పంటల బీమా కింద 8,172 మంది రైతులకు రూ.9.52 కోట్లు, వైఎస్సార్ యంత్ర సేవా కోసం 90 మంది లబ్ధిదారులకు రూ.1.35 కోట్లు అందజేశారు. ఇలా మొత్తం దాదాపు రూ.26.65 కోట్లు రైతులకు అందించి రైతుపక్షపాతిగా నిలిచారు.

**హామీలతో మభ్యపెట్టి..**

గత ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ కన్నా ఎక్కువ సంక్షేమం అందిస్తామని, రెండింతలు సాయం చేస్తామని చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో రైతులు ఓట్లేసి గెలిపించారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత నెమ్మదిగా తన మార్క్ షాకులిస్తుండటంతో రైతులకు కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. తమకు ప్రభుత్వం అండగా నిలిచేలా లేదని వారు ఇప్పటికే ఓ అంచనాకు వచ్చారు. మొన్నటి వరకు ఉచిత పంటల బీమా వర్తించగా.. ప్రస్తుతం తామే చెల్లించాల్సి రావడంతో బీమా ప్రీమియం భారంగా మారింది. మండలంలో రబీ, ఖరీఫ్ సీజన్‌లలో మొత్తం సుమారు 42వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేశారు.ఖరీఫ్‌లో పత్తి, మిరప, సజ్జ, కంది, కొర్ర, వేరుశనగ తదితర పంటలు సుమారు 18వేల ఎకరాల్లో సాగు చేశారు. అలాగే రబీలో పప్పుశనగ, పొద్దుతిరుగుడు, జొన్న తదితర పంటలు సుమారు 24వేల ఎకరాల్లో సాగు చేశారు. వీటన్నింటికీ పంటల వారీగా రైతులే బీమా చేయించుకోవాలని ప్రభుత్వం సూచించింది. బీమా చేయించుకున్నవారికి మాత్రమే పంట నష్టపరిహారం అందుతుందని పేర్కొంది. దీంతో పంటలు నష్టపోయిన రైతులు పరిహారం రాదని తెలిసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక శాతం మంది రైతులు బీమా నమోదుకు దూరంగా ఉన్నారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈనెల 15వ తేదీ వరకు రబీ పంటలకు బీమా చేయించుకోవడానికి అవకాశముందని, వరికి మాత్రం నెలాఖరు వరకు ఉందని చెబుతున్నప్పటికీ అన్నదాతలు ముందుకు రావడం లేదు.



నగరడోణలో నీట మునిగిన పత్తి పైరు (ఫైల్)



బెల్డోణలో గాలివానకు నేలకొరిగిన జొన్న పంట

**ఇప్పటికే పంటలు నష్టపోయాం..**



అనావృష్టి, అతివృష్టితో పంటలు దెబ్బతిన్న మాకు బీమా ప్రీమియం చెల్లింపు అదనపు భారంగా మారింది. గతంలో ఎలాంటి ప్రీమియం చెల్లించకపోయినా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంటలు నష్టపోతే పరిహారం అందించి అండగా నిలిచింది. ఇప్పుడు కూడా ప్రభుత్వం చొరవ చూపి ఉచిత పంటల బీమా వర్తింపజేయాలి. అలాగే.. పెట్టుబడి సాయంగా ఇస్తానన్న రూ.20వేలు ఇస్తే పంట నూర్పిళ్లకు ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయి.

– పోతప్ప, రైతు, నగరడోణ

**రబీ పంటలకు బీమా చేయించుకోవాలి**



రబీలో పంటలు సాగు చేసిన రైతులు పంటల బీమా చేయించుకోవాలి. ఈ ఏడాది నుంచి బీమా బాధ్యత రైతులదే. బీమా ప్రీమియం చెల్లించకపోతే నష్టపరిహారం వచ్చే అవకాశం లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎకరా పప్పుశనగకు గ్రామ యూనిట్‌కు రూ.420, వరికి మండల యూనిట్‌గా రూ. 630, జొన్నకు మండల యూనిట్‌గా రూ. 297, వేరుశనగకు మండల యూనిట్‌గా రూ.480, ఉల్లికి జిల్లా యునిట్‌గా రూ.1,350, టమాటకు మండల యూనిట్‌గా రూ.1,500 ప్రకారం ప్రీమియం చెల్లించాలి.

– విజయలక్ష్మి, ఏఓ

# ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లండి



మాట్లాడుతున్న జడ్జి ఎస్ఎస్ భారతి

పత్తికొండ(తుగ్గలి) : దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం పత్తికొండలో సెక్రెడ్ సంస్థ, సిద్ధార్థ మండల దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు దివ్యాంగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ..అంగవైకల్యం శరీరానికి మాత్రమేగాని ఆలోచనలకు కాదన్నారు. సెక్రెడ్ సంస్థ డైరెక్టర్ సీసీ తిప్పన్న, న్యాయవాదులు సూరజ్, నరసింహులు, రజాక్, ట్రాన్స్‌కో జూనియర్ అకౌంటెంట్ లక్ష్మన్న, సిద్ధార్థ దివ్యాంగుల మండల సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, సభ్యులు ఉరుకుందమ్మ, బీరప్ప, వీరేశమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రంగమ్మ

ఆలూరు రూరల్: ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని ఎంపీపీ రంగమ్మ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ఆర్డీటీ ఆడిటోరియంలో శ్రీ సాయి మండల వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని మండల అధ్యక్షుడు వీరేష్, గౌరవ అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీతో పాటు ఎంఈఓ చిరంజీవి రెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు శ్రీకాంత్ అతిథులుగా హాజరయ్యారు. అంతకు ముందు దివ్యాంగులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. చిప్పగిరి, హాలహర్వి మండలాల వికలాంగ సమాఖ్య అధ్యక్షులు గోవిందప్ప, జంబయ్య నాయకులు గాదిలింగ,సరోజమ్మ, దివ్యాంగులు హాజరయ్యారు.

## రోడ్డు పనులకు నిధులు విడుదల

హొళగుంద: అర్ధాంతరంగా నిలిచిన హొళగుంద–ఢణాపురం రోడ్డు పనులు త్వరలో ప్రారంభమవుతాయని హొళగుంద మాజీ సర్పంచ్ రాజ పంపన్నగౌడ్ బుధవారం తెలిపారు. అధ్వానంగా మారిన రోడ్డు గురించి పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో ఆర్అండ్‌బీ అధికారుల నుంచి సమాధానం వచ్చిందని చెప్పారు. 23.115 కి.మీ డబుల్ రోడ్డు నిర్మాణానికి ఇంతకు ముందు ఎన్‌డీబీ నిధులు రూ.62.29 కోట్లు మంజూరయ్యాయని, అయితే బిల్లుల మంజూరులో ఆలస్యం కావడం వల్ల కాంట్రాక్టర్ పనులను నిలిపి వేశారన్నారు. ప్రస్తుతం బిల్లులు మంజూరయ్యాయని త్వరలో కాంట్రాక్టర్ 23.415 కి.మీ. డబుల్ లేన్ తారురోడ్డు, 1.7 కి.మీ డబుల్ లేన్ సీసీ రోడ్డు పనులు చేపడతారని అధికారులు లేఖలో పేర్కొన్నారని చెప్పారు.

**గజ్జహళ్లి రోడ్డు మరమ్మతు పనులు**

అధ్వానంగా మారిన గజ్జహళ్లి–ఆదోని రోడ్ క్రాస్ రోడ్డులో బుధవారం ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతు పనులు ప్రారంభించారు. రోడ్డు దుస్థితిపై గ్రామస్తులు రామలింగ తదితరులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు గజ్జహళ్లి నుంచి ఆదోని రోడ్ క్రాస్ వరకు ఉన్న 6 కి.మీ రస్తా మరమ్మతుకు దాదాపు రూ.62 లక్షలు మంజూరు చేయించారు. ఆ నిధులతో బుధవారం రోడ్డును చదును చేసే పనులు మొదలు పెట్టారు.



రోడ్డు పనులు చేస్తున్నట్లు ఫిర్యాదుదారుడికి లెటర్ ఇస్తున్న ఆర్అండ్‌బీ సిబ్బంది

## వీడని వాన

మద్దికెర : నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షం బుధవారం కూడా కొనసాగింది. ఉదయం నుంచి మేఘావృతమై, ఈదరు గాలులతో కూడిన జల్లులు పడుతుండటంతో పంట చేతికొచ్చిన, కోత కోసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి కోతలు పూర్తయిన రైతులు దిగుబడిని రక్షించుకునేందుకు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. పొలాలు, కల్లాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం తడవకుండా పట్టలు కప్పి, వాటిపైన వరగడ్డి కూడా కప్పుతున్నారు. అయితే రోజుల తరబడి కప్పి ఉంచడంతో పచ్చి ధాన్యం రంగు మారుతుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నల్లటి మబ్బులు కమ్ముకుపోవడంతో భారీ వర్షం కురుస్తుందేమనని రైతులు దిగాలు చెందారు.



బసినేపల్లి వద్ద ధాన్యంపై వరిగడ్డి కప్పిన దృశ్యం

## గిరిజన పాఠశాలకు తాత్కాలిక ఉపాధ్యాయులు

ఆలూరు రూరల్: స్థానిక హత్తిబెళగల్ రహదారిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలకు నలుగురు తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించినట్లు మండల ఎంఈఓ–2 చిరంజీవి రెడ్డి తెలిపారు. గిరిజన పాఠశాలలో పనిచేస్తున్న ఏడుగురు టీజీటీలు ఉద్యోగ భద్రత కల్పించాలని గత నెల 14వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లారు. దీంతో విద్యార్థులకు పాఠాలు బోధించేవారు లేక ఇబ్బంది పడుతున్నారని ఎంఈఓ దృష్టికి వెళ్లడంతో బుధవారం నలుగురు ఉపాధ్యాయులను నియమించినట్లు చెప్పారు.

## 9న లక్ష దీపోత్సవం

హాలహర్వి: మండలంలోని జె.హొసళ్లి గ్రామంలో ఈనెల 8వ తేదీన అడ్డుపల్లకి, 9న లక్ష దీపోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పీఠాధిపతి శంభులింగ మరిదేవరు పిలుపునిచ్చారు. బుధవారం పీఠాధిపతి మాట్లాడుతూ లోక క్షేమాన్ని కాంక్షిస్తూ ఏటా లక్ష దీపోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారని తెలిపారు.

## వేతనాలు చెల్లించాలి

తుగ్గలి : మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని సీపీఎం మండల కన్వీనర్ శ్రీరాములు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు అందక నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయని, వాటికనుగుణంగా ప్రభుత్వం మెనూ చార్జీలు పెంచలేదని దీంతో నిర్వాహకులపై ఆర్థిక భారం పడుతోందన్నారు. నిర్వాహకుల సమస్యలు తెలిసినా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు.

## 7న పేరెంట్స్ మీటింగ్

పత్తికొండ(తుగ్గలి) : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 7వ తేదీన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఎంఈవో తిమ్మారెడ్డి తెలిపారు. స్థానిక బాలుర హైస్కూల్‌లో బుధవారం హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం పాఠశాలల పటిష్టతకు, విద్యార్థి వికాసానికి, సమస్యల పరిష్కారానికి దిక్సూచిగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య ఓ ఆత్మీ వారధిని నిర్మిస్తుందన్నారు. ప్రజాప్రతినిధులు, దాతలు, పూర్వ విద్యార్థులు హాజరయ్యే ఈ కార్యక్రమం ద్వారా పిల్లల చదువు, ప్రవర్తన, క్రమశిక్షణ తదితర వివరాలను తల్లిదండ్రులు తెలుసుకోవచ్చన్నారు. నిర్దేశించిన బాధ్యతలను పాటించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో–2 రమేష్ పాల్గొన్నారు.

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7వ తేదీన తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం నజీర్ అహమ్మద్ బుధవారం తెలిపారు.

# రేపటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

పత్తికొండ(తుగ్గలి) : ఈనెల 6వతేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఆర్డీవో ఎస్.భరత్‌నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి రైతులు అర్జీలు సమర్పించవచ్చన్నారు. ప్రతి మండలంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో ఒక బృందం , డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో మరో బృందం నిర్దేశించిన గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆస్పరి: మండలంలోని గ్రామాల్లో ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 7వ తేదీ వరకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శివశంకర్ నాయక్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ సభల్లో భూములకు సంబంధించిన సమస్యలుంటే రైతులు దరఖాస్తులు అందజేస్తే విచారణ చేసి చర్యలు తీసకుంటామన్నారు. గ్రామాల వారీగా..ఈనెల 6న తంగరడోణ, 7న యాటకల్లు, 10న ములుగుందం, 11 కైరుప్పల, 12న డి.కోటకొండ, 13న బిల్లేకల్లు, 17న జొహరాపురం, 18న చిన్నహోతూరు, 19న నగరూరు, 20న హలిగేర, 21న చొక్కనహళ్లి, 24న ఆస్పరి, 26న తురువగల్లు, 27న బిణిగేరి, 28న చిగిళి, 31న చిరుమాన్‌దొడ్డి, జనవరి 2న శంకరబండ, 3న బనవనూరు, 4న కారుమంచి, 7న ముత్తుకూరు గ్రామాల్లో సభలు నిర్వహిస్తామని వివరించారు.

మద్దికెర : ఈనెల 6 వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మండలంలోని గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో వీఆర్వోలు, సర్వేయర్ల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ బుధవారం తెలిపారు. 6న పెరవలి, 10న ఎడవలి, 12న మద్దికెర తూర్పు, 13న మద్దికెర ఉత్తరం, 17న మద్దికెర పడమర, 19 న ఎం .అగ్రహారం, 21న హంప, 24న బసినేపల్లి, 27న బురుజుల గ్రామాల్లో సభలు చేపడతామని వివరించారు. రైతులు తమ భూములకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే అర్జీలు అందజేయాలని చెప్పారు.

కృష్ణగిరి: మండలంలో అన్ని గ్రామాల్లో రేపటి నుంచి వచ్చే ఏడాది జవవరి 3వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 6న అమకతాడు, 7న మన్నెకుంట, 10న చిట్యాల, 11న ఎరుకలచెరువు, 12న కృష్ణగిరి, 13న లక్కసాగరం, 17న కటారుకొండ, 18న చుంచుఎర్రగుడి, 19న కంబాలపాడు, 20న ఆలంకొండ, 21న తొగర్చేడు, 27న పోతుగల్లు, 28న ఆగవేళి, 2025 జనవరి 2న టి.గోకులపాడు, 3న ఎస్‌హెచ్ ఎర్రగుడిలో సదస్సులు ఉంటాయని వివరించారు.

**వెల్దుర్తి మండలంలో..**

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలో ఈ నెల 6 నుంచి 31వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ బుధవారం తెలిపారు. 6న సూదాపల్లె, 7న గోవర్ధనగిరి, 10న లక్ష్మీనగరం, 11న వెల్దుర్తి, 12న బుక్కాపురం, 13న కలుగోట్ల, 17న పుల్లగుమ్మి, 18న రామళ్లకోట, 19న ఎస్. బోయినపల్లె, 20న నరసాపురం, 21న సర్పరాజపురం, 24న మల్లెపల్లె, 26న నార్లాపురం, 27న చెరుకులపాడు, 28న ఎస్. పేరెముల, 31న బోగోలు గ్రామంలో సదస్సులు నిర్వహిస్తున్నమని భూ సమస్యలున్న రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సంక్షిప్తం

**చౌకదుకాణాల తనిఖీ**

తుగ్గలి : మండలంలోని పెండేకల్లు గ్రామంలోని రెండు చౌకదుకాణాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. 3వ చౌకదుకాణంలో రికార్డులు, స్టాకు నిల్వలను పరిశీలించారు. 250 కేజీల రేషన్ బియ్యం తేడా ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. ఈ మేరకు అధికారులు 6ఏ కేసు నమోదు చేశారు.

**పంటల బీమా చేయించుకోవాలి**

దేవనకొండ: రబీ సీజన్‌లో పంటలను సాగుచేసిన రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా బీమా చేయించాలని మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పప్పుశనగ పంటకు ఎకరాకు రూ.420, జొన్నకు రూ.297, వేరుశనగకు రూ.480, ఉల్లికి రూ.1,350, వరికి రూ.630 చొప్పున చెల్లించాలన్నారు. పంటల నమోదు చేసుకుని ఈ–కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే బీమా వర్తిస్తుందని చెప్పారు.

**సీసీపై దాడి అమానుషం**

పత్తికొండ(తుగ్గలి) : విధి నిర్వహణలో ఉన్న వెలుగు సీసీ శేషప్పపై దాడిని వెలుగు జేఏసీ సభ్యులు రాఘవేంద్ర, రవి, కృష్ణుడు ఖండించారు. దాడికి పాల్పడిన పట్టణానికి చెందిన పురుషోత్తం, కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్, ఆర్డీవో భరత్ నాయక్, రూరల్ సీఐ పులిశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది నరసన్న, చక్రధర్, అరుణ, ముదురంగడు, జనార్ధన, రామాంజనేయులు ఈరన్న, రాజశేఖర్ పాల్గొన్నారు.

**కార్మికుల హక్కుల సాధనకు పోరాటం**



సీపీఎం ప్రాంతీయ మహాసభలో మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

ఆలూరు రూరల్: కార్మికులు,రైతుల హక్కుల కోసం సీపీఎం నిరంతరం పోరాటం చేస్తోందని సీపీఎం జిల్లా అధ్యక్షుడు గౌస్ దేశాయ్ అన్నారు. బుధవారం స్థానిక జ్యోతిబసు భవన్‌లో ఆ పార్టీ మండల కన్వీనర్ షాకీర్, సీనియర్ నాయకులు నారాయణ స్వామి ఆధ్వర్యంలో సీపీఎం ప్రాంతీయ కమిటీ మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే వలసలు నివారించి, వేదావతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. గత మహాసభల్లో చేసిన తీర్మానాల అమలు, వాటి సాధనకు కృషి చేశామని చెప్పారు. అంతకు ముందు పార్టీ కార్యాలయం ఎదుట పార్టీ జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, సభ్యులు హనుమంతు, రత్నమ్మ హాజరయ్యారు.

# కొలిచే వారికి కొంగు బంగారం చెన్నకేశవ స్వామి

- రేపు మొలగవల్లిలో రథోత్సవం.. 7న గ్రామోత్సవం
- తరలిరానున్న భక్తులు.. ముస్తాబైన ఆలయం



మొలగవల్లిలో ముస్తాబైన చెన్నకేశవ స్వామి ఆలయం



శ్రీ చెన్నకేశవ స్వామి

ఆలూరు రూరల్: కొలిచే వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీ చెన్నకేశవ స్వామి రథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. రథోత్సవం సందర్భంగా మండలంలోని మొలగవల్లి గ్రామంలో కొలువైన చెన్నకేశవ స్వామి ఆలయాన్ని ముస్తాబు చేసి రథాన్ని ఉత్సవాలకు సిద్ధం చేశారు. రేపు ఉదయం లక్ష్మీదేవి,భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు ప్రభుస్వామి ఆధ్వర్యంలో పండితుల వేదమంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించనున్నారు. అంతకు ముందు గణపతి పూజ, స్వామి వారికి పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు చేపట్టి సాయంత్రం రథోత్సవాన్ని జరిపిస్తామని నిర్వాహకులు, గ్రామపెద్దలు తెలిపారు.

**7న గ్రామోత్సవం**

రథోత్సవం ముగిసిన రెండు రోజుల తరువాత అంటే..7వ తేదీన స్వామి, అమ్మవార్ల ఉత్సమూర్తులకు గ్రామోత్సవం చేపడతారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో హనుమద్వాహనం, అశ్వవాహనం, గరుడు వాహనంపై దేవదేవుడిని ఆశీనులు గావించి పురవీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం గ్రామస్తులు సద్దలతో తయారు చేసిన కుడుములను ఇరువర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు విసురుకుంటారు.

**తరలిరానున్న భక్తులు..**

రథోత్సవం సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకోనున్నారు. దర్శనం కోసం వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు. రథోత్సవం సందర్భంగా గ్రామంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఆలూరు సీఐ వెంకట చలపతి ఆధ్వర్యంలో పోలీసులుగట్టి బందోబస్తు నిర్వహించనున్నారు.

## వలగొండకు నేడు ఎమ్మెల్యే రాక

ఆస్పరి: మండలంలోని వలగొండ గ్రామానికి ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి గురువారం రానున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య బుధవారం తెలిపారు. గ్రామంలో జరిగే ధ్వజ స్తంభం, కాళికాదేవి నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు.